నేడు వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ

- హాజరు కానున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


వైసీ తిమ్మారెడ్డి(ఫైల్)

మడకశిర: స్థానిక మాజీ ఎమ్మెల్యే, దివంగత వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముహూర్తం ఖరారైంది. మడకశిరలోని మధుగిరి రోడ్డులో వైబీ హళ్లి క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆయన విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ హాజరు కానున్నారు. ఈ మేరకు వైసీ తిమ్మారెడ్డి కుమారుడు, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకరరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైసీ తిమ్మారెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, మడకశిర మండలం వైబీహళ్లికి చెందిన చిన్న తిమ్మారెడ్డి, నారెమ్మ దంపతులకు 1919లో తిమ్మారెడ్డి జన్మించారు. వైఎస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉంటూ వచ్చారు. 1959 నుంచి 1970 వరకు మడకశిర సమితి అధ్యక్షుడిగా, అనంతపురం జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. 1972 నుంచి 1978 వరకు ఎమ్మెల్సీగా, 1983 నుంచి 1985 వరకు ఎమ్మెల్యేగా విశిష్ట సేవలు అందించారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఓటమి చవి చూడని ఆయన 1986లో మృతి చెందారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నైతిక విలువలకు కట్టుబడి పని చేసిన వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మార్కెట్లకు లక్ష్మీ కళ


వరలక్ష్మీ అమ్మవారు

- జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు వరలక్ష్మీవ్రత శోభ
- కిటకిటలాడిన మార్కెట్లు


హిందూపురంలో పూల కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న మార్కెట్


పండ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతం పండుగ శోభ సంతరించుకుంది. శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆలయాలన్నీ అందంగా ముస్తాబయ్యాయి. వరాలిచ్చే చల్లని తల్లి అయిన వరలక్ష్మీదేవి అనుగ్రహం కోసం మహిళలు విశేషంగా వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాలు, ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతం చేసుకోవడాని మహిళలు సిద్ధమయ్యారు. అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేకంగా వరలక్ష్మీ వ్రతాలను ఆచరించడానికి ఏర్పాట్లు చేశారు.

వరలక్ష్మీ వ్రతంతో విశేష ఫలితాలు..

సౌరమానం ప్రకారం హిందూ సంవత్సరాదిలోని ఐదో నెల శ్రావణం.ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైన ఈ మాసంలో ప్రతిరోజూ పండగే. అయితే, శ్రావణమాసానికి పరిపూర్ణత, పరిపక్వతను తీసుకొచ్చేది వరలక్ష్మీ వ్రతం. పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు ఈ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. శ్రీమహావిష్ణువు దేవేరి అయిన మహాలక్ష్మీ అష్టవిధ రూపాలతో సర్వ మానవాళి కోరికలు తీరుస్తూ, ఎల్లవేళలా రక్షిస్తుంది. కానీ అష్టలక్ష్ముల్లో వరలక్ష్మీకి ఓ ప్రత్యేకత ఉంది. మిగతా లక్ష్మీల కంటే వరలక్ష్మీని పూజించడం చాలా శ్రేష్టం. శ్రీహరి జన్మ నక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే మాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు దక్కుతాయి. సర్వ మంగళ సంప్రాప్తి, సకలాభీష్టం, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని మహిళలు ఈ వ్రతం చేస్తారు.

వరలక్ష్మీ వ్రతం ఇలా..

శ్రావణ శుక్రవారం రోజున స్త్రీలు వేకువజామున లేచి తాలారాస్నానం చేసి పట్టువస్త్రాలు ధరిస్తారు. తమ పూజా గదిలో మండపం ఏర్పాటు చేసి రావి, జువ్వి, మర్రి, మామిడి మెదలైన ఆకులతో కలశం ఏర్పాటు చేసి వరలక్ష్మీదేవిని ఆహ్వానించి ప్రతిష్టిస్తారు. అమ్మవారిని ప్రత్యేక పూజలతో పూజించి భక్ష్య, భోజ్యాలతో నివేదిస్తారు. ప్రత్యేక పూజలు చేస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో అధికంగా చేస్తారు. ఈ పండుగను ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారు. వ్రతం రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచుకొంటారు.

వ్యాపారుల్లో నూతనోత్తేజం..

శ్రావణ మాసం రావడంతో వ్యాపారుల్లోనూ నూతనోత్తేజం సంతరించుకొంది. అన్ని వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఆషాడం, అధికమాసం రావడంతో రెండు నెలలుగా వ్యాపారాలు నత్తనడకన సాగాయి. నేడు వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు జరగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో పండ్లు, పూలు, నిత్యావసర వస్తువుల కొనుగోలుదారులతో మార్కెట్లు, ప్రధాన రోడ్లు కిటకిటలాడాయి.

అంకిత భావంతో పనిచేసినప్పుడే గుర్తింపు : ఎస్పీ


లక్ష్మీనారాయణమూర్తికి చెక్ అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: విధుల నిర్వహణలో అంకిత భావంతో పనిచేసినప్పుడే ఉద్యోగికి సరైన గుర్తింపు ఉంటుందని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. హిందూపురంలో హోంగార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మీనారాయణ మూర్తిని గురువారం తన చాంబర్‌లో ఎస్పీ ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. జిల్లాలో హోంగార్డులు తమ ఒక్క రోజు వేతనాన్ని రూ.4,39,200 చెక్కు రూపంలో ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనేది సర్వ సాధారణమని, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించినప్పుడే ప్రజల మన్నన పొందగలుగుతామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐ టైటాస్, నారాయణరాజు, పలువురు హోంగార్డులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు మృతి

హిందూపురం అర్బన్: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని కొట్నూరు రైల్వే గేటు సమీపంలో గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని యువకుడు (22) రైలు కింద పడి మృతి చెందాడు. బెంగళూరు నుంచి పెనుకొండ వైపు వెళ్లే రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్ నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు రైలు నుంచి జారి పడ్డాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

108లో ప్రసవం

అమరాపురం: ఓ మహిళ 108 వాహనంలో పండంటి మగబిడ్డకు జన్మ ఇచ్చింది. పి.శివరం గ్రామానికి చెందిన రంజితకు పురిటి నొప్పులు రావడంతో ఆమెను తీసుకొచ్చేందుకు 108 వాహన సిబ్బంది వెళ్లారు. మార్గం మధ్యలోనే నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ నరసింహమూర్తి సహకారంతో కాన్పు నిర్వహించగా రంజిత మగబిడ్డకు జన్మనిచ్చింది. అక్కడి నుంచి అమరాపురం పీహెచ్‌సీకి తీసుకొచ్చి వైద్య సేవల తర్వాత పి.శివరం గ్రామానికి చేర్చారు.

విద్యార్థులకు చెక్కులు అందజేత

గుడిబండ: ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని కెనరాబ్యాంకు రీజనల్ మేనేజర్ మహబూబ్‌బాషా, అనూరాధ, నాబార్డ్ ఏజీఎమ్, ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు. మందలపల్లి ఉన్నత పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించిన 6 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కెనరా విద్యాజ్యోతి పథకం కింద గురువారం రూ.2500 చొప్పున అందజేశారు. సర్పంచ్ అశ్వత్, పాల్గొన్నారు. ఎల్‌డీఎం రమణకుమార్, డీపీఎం పద్మావతి, లోకేంద్రనాథ్‌రెడ్డి, మణికుమార్‌రెడ్డి, మేనేజర్లు, శ్రీధర్ పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం


పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేష్ కృష్ణ

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు క్రాస్‌లో ఉన్న జగనన్న కాలనీలోకి మహాత్మా జ్యోతిబా పాఠశాల నుంచి వచ్చే మురుగు నీటిని పొలాలకు మళ్లించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ నరేష్ కృష్ణ తెలిపారు. గురువారం ఆయన జగనన్న కాలనీని సందర్శించారు. మురుగునీటిని వినియోగించుకునేందుకు రైతులు ముందుకు వచ్చారని, ఉపాధిహామీ ద్వారా డైవర్షన్ కాలువ తవ్వించి రైతుల పొలాల్లోకి మళ్లి స్తామన్నారు.

జిల్లా జట్టుకు ఎంపిక



దుర్గాప్రసాద్, సాయి

పరిగి: జిల్లా స్థాయి పుట్‌బాల్ జట్టుకు సేవామందిరానికి చెందిన దుర్గాప్రసాద్, సాయి అనే క్రీడాకారులు ఎంపికైనట్లు మండల పుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కార్తీక్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

పావగడ: ఇటీవల మృతి చెందిన తాలూకాలోని మంగళవాడ గ్రామానికి చెందిన వాల్మీకి జాగృతి వేదిక డైరెక్టర్ డీ నాగరాజు కుటుంబాన్ని వాల్మీకి జాగృతి వేదిక, అఖిల కర్ణాటక వాల్మీకి నాయక మహాసభ, వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆదుకుంది. బాధిత కుటుంబానికి గురువారం రూ.55 వేలు అందించారు. నాగరాజు, పాళేగార్ లోకేశ్, స్వారణ్ణ, ధనుంజయ, ఓంకార నాయక, భాస్కరనాయక, తిప్పేస్వామి, మంజునాథ్, తిమ్మయ్య, కాంతరాజ్ పాల్గొన్నారు.

పట్టణ శుభ్రతకు సహకరించండి

మడకశిర: పట్టణంలోని మార్కెట్ పరిసర ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు గురువారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని కార్మికులతో పూర్తిగా తొలగింపజేశారు.

హోరాహోరీగా జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు


పరుగుకు సిద్ధమైన ఎడ్ల బండి

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు ఎగువవీధి చితంబరరెడ్డి జ్ఞాపకార్థం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద గురువారం నిర్వహించిన ఎద్దుల బండ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎంపీపీ ఏవి రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షురాలు ఉషారాణి, సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, లిఖిత్‌రెడ్డి పర్యవేక్షణలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉత్కంఠగా సాగిన ఈ పోటీలను రౌండ్ల వారీగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై పోటీలు ప్రారంభించారు. కదిరి, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, ధర్మవరంతో పాటు కర్ణాటక నుంచి 68 బండ్లను రైతులు తీసుకొచ్చారు. రెండేసి బండ్లకు పోటీ నిర్వహిస్తూ మొత్తం ఆరు రౌండ్లలో విజేతలను ఎంపిక చేశారు. కర్ణాటక నుంచి విచ్చేసిన ఎద్దులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి 8.30 గంటలకు పోటీలు ముగిసాయి. అనంతరం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలకు నిర్వాహకులు ఏవీ రమణారెడ్డి నగదు బహుమతులు అందజేశారు. సమయాభావం కారణంగా చివరగా పోటీలో నిలిచిన రైతులు బుక్కపట్నం జంగం వెంకటేషు, కొత్తచెరువు రోషన్, జగరాజుపల్లి లయకిషోర్, కొత్తచెరువు రామాంజనేయులు, వెల్దుర్తి సతీష్, బూసేపల్లి నాగభూషణకు చెరో రూ.15 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే ఇలాంటి పోటీలు తరచూ నిర్వహించడం ద్వారా రైతులను ఉత్తేజ పరిచినట్లవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవాలన్నారు.



నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పోటీలను చూసేందుకు వచ్చిన జనం

గంధపు చెక్కలు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న గంధం చెక్కలు చూపుతున్న పోలీసులు

గోరంట్ల: గంధపు చెట్లను నరికి చిన్న ముక్కలుగా చేసి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పట్టుబడిన వారిలో గోరంట్లకు చెందిన దేశయ్య, గజేంద్ర ఉన్నారు. వీరు కొడికొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో గంధం చెట్లను నరికి కర్ణాటకలోని సిరా ప్రాంతానికి తరలిస్తుండగా గొల్లపల్లి క్రాస్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి గంధపు చెక్కలు స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు.

డిగ్రీ రెండో విడత ప్రవేశాలు ప్రారంభం

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ కేశవరావు గురువారం తెలిపారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 1వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీకాం జనరల్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ, బీఏ హిస్టరీ ఆనర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలకు 7382792779 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'నాడు-నేడు'తో మెరుగైన సదుపాయాలు

- జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేసిన విద్యార్థులు


ఎమ్మెల్యే తిప్పేస్వామితో విద్యార్థులు

మడకశిర రూరల్: మండలంలోని సీ కొడిగేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల రూపు రేఖలు మార్చి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. సీ కొడిగేపల్లి ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎమ్మెల్యే తిప్పేస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. గతంలో చదువుకోవడానికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఉండేవని, సీఎం జగన్ ప్రవేశపెట్టిన నాడు- నేడు పథకం ద్వారా కార్పొరేట్ తరహాలో సదుపాయాలు కల్పించారని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న నాడు- నేడు ద్వారా వేల కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

మడకశిర: మడకశిరలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే తిప్పేస్వామి గురువారం తనిఖీ చేశారు. భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్‌ను ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

హిందూపురం: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు ఆర్‌పీజీటీ రోడ్డు సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా అధికారులను కోరారు. వ్యాపార లావాదేవీలకు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు వద్దకు ప్రజలు, వ్యాపారులు వస్తుంటారని, అక్కడ వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. వన్‌టౌన్ సీఐ ఈరన్న మాట్లాడుతూ పరిగిరోడ్డు, మెయిన్‌రోడ్డు రెండు పక్కలా వాహనాల రాకపోకలకు ఇబ్బందిలేకుండా చర్యలు చేపడుతామన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చర్యలు

- కలెక్టర్ అరుణ్‌బాబు


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'మాతా శిశు మరణాలు సంభవించకుండా ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. బడి బయట ఉన్న విద్యార్థులందరినీ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పేలా చర్యలు తీసుకుంటున్నాం ' అని కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి తెలిపారు. గురువారం సాయంత్రం డాక్టర్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించి ప్రసవాలు జరిగేలా చూస్తామన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను వినియోగించుకుంటామని, రక్తహీనతతో ఎవరూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈనెల 30న జగనన్న కాలనీలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నాడు - నేడు పనులు త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వైఎస్సార్ బీమా పొందడానికి లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లు వెంటనే జారీ చేసి బీమా వర్తింపజేస్తామన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సెప్టెంబర్ 17న ప్రారంభిస్తున్నారన్నారు. ఇందుకు గాను 18 రకాల కళాకారులు (బంగారుపని, కుమ్మరి పని, బోట్లు తయారీ, టైలర్లు మొదలైనవారు) గుర్తించి ఈ పథకం కిందికి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. వారికి రూ.2 లక్షల వరకూ రుణ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈఓ మీనాక్షి, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన సంబరాలు


జాతీయ జెండాలతో మానవహారం

హిందూపురం టౌన్: చంద్రయాన్-3 విజయవంతం ప్రతి భారతీయుడికి గర్వకారణమని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. గురువారం శ్రీచైతన్య పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు చంద్రయాన్-3 రాకెట్, చందమామ నమూనాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇస్రో శాస్త్రవేత్తల సేవలను కొనియాడారు. వన్‌టౌన్ సీఐ ఈరన్న, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం: పట్టణంలోని బాలాజీ డిగ్రీకళాశాలలో సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వీరభద్రప్ప మాట్లాడుతూ శాస్త్రవేత్తలు నిరంతరం శ్రమించి చంద్రయాన్-3ని విజయవంతం చేసి భారత దేశ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేశారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ పాల్గొన్నారు. అదేవిధంగా నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు షేరీ డ్రమ్స్, జాతీయ పతకాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జైఇండియా, జై ఇస్రో అని నినదించారు.

పరిగి: విద్యానిధి కళాశాల ప్రిన్సిపాల్ యల్లారెడ్డి నేతృత్వంలో 200 అడుగుల జాతీయ జెండాతో సేవామందిరం కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంఈఓ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎంపీటీసీ మారుతీరెడ్డి పాల్గొన్నారు.

పెనుకొండ: ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతంపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఘనగిరి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఇలియాజ్, మిట్టాంజనేయస్వామి దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, అల్ కౌసర్ సేవా సంస్థ చైర్మన్ అహ్మద్, మానవహక్కుల సంఘం నాయకులు రవూఫ్, విద్యార్థులు తదితరులు పేర్కొన్నారు.

అగళి: చంద్రయాన్-3 విజయవంతంతో గురువారం అగళి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు.

కరుణించు వరుణదేవా..

మడకశిరరూరల్: అరకొర వర్షాలు పడటంతో అన్నదాతలు వరుణుడి కరుణ కోసం వినూత్న రీతిలో పూజలు, పునస్కారాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మడకశిర మండలంలోని హారే సముద్రంలో గురువారం సాయంత్రం గాడిదలకు పెళ్లిళ్లు జరిపించారు. గార్ధభాలను అలంకరించి కరుణించు వరుణ దేవా అంటూ గ్రామంలో ఊరేగించారు.



మెరుగైన వైద్యం అందించండి



సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

మడకశిరరూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి సిబ్బందికి సూచించారు. ఆమె గురువారం కదిరేపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో నెలకు మూడుకుపైగా కాన్పులు చేయాలన్నారు. గ్రామాల్లో పర్యటించి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇంటి వద్దనే వైద్య చికిత్సలు అందించాలన్నారు. డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.







ఇంటింటా సంక్షేమ కాంతులు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



బైరాపురంలో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న దీపికా

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి,
- హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

మడకశిర రూరల్: పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని, ఈక్రమంలో ప్రతి ఇంటా సంతోషాలు వెల్లువెత్తుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. మండలంలోని సీ కొడిగేపల్లి గ్రామంలో గురువారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీసీ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారానికి స్తంభాలు వేయిస్తామని, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న పేద వర్గాలకు అండగా ఉంటూ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తూ తమను ఆర్థికంగా ఆదుకుంటున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా మళ్లీ జగనన్నకే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగనన్న వందశాతం నెరవేర్చారన్నారు. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, మూర్తి, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర యాదవ్, ఎంపీటీసీ శారదమ్మ, సర్పంచ్ రంగనాథ్ పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు

లేపాక్షి: సీఎం జగనన్న అమలు చేసిన నవరత్నాలు పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికా అన్నారు. కల్లూరు, బైరాపురం, నాయనిపల్లి గ్రామాల్లో గురువారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. పాదయాత్ర సమయంలో ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారంలోకి వచ్చాక నవరత్నాలు అమలు చేశారన్నారు. సర్పంచ్ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ నీలావతి, అగ్రిబోర్డు చైర్మన్ ప్రభాకర్, ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు, నాయకులు తిప్పన్న, గంగప్ప, జయశంకరరెడ్డి, శివశంకరరెడ్డి, హనుమంతరెడ్డి, కగ్గల్లప్ప, రవీంద్రారెడ్డి, ప్రభాకర్, హనుమంతప్ప, నరసింహమూర్తి, ఈరప్ప, నాగిరెడ్డి, రాము పాల్గొన్నారు.

జనంతో మార్కెట్లు కిటకిట



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

హిందూపురం అర్బన్/టౌన్/పావగడ: శుక్రవారం వరమహాలక్ష్మీ పండుగ నేపథ్యంలో మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి. గురువారం మహిళలు పెద్ద సంఖ్యలో మార్కెట్లకు తరలివెళ్లి అమ్మవారి ప్రతిమలతోపాటు పండుగకు అవసరమైన పూలు, కాయలు, అరటిగెలలు, చెరుకు గడలు, మామిడి ఆకులు కొనుగోలు చేశారు. కర్ణాటకలోని పావగడలో పూల ధరలు ఆకాశాన్నంటాయి. కనకాంబరాలు బార రూ.300, మల్లెలు రూ.200, కాగడాలు రూ.150, చామంతులు రూ.200, చెండుపూలు రూ.80 ధర పలికాయి.



మంత్రికి ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం మడకశిరకు వస్తున్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. ఈసందర్భంగా మంత్రికి పట్టణంలోని చీపులేటి వద్ద ఘనంగా స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చీపులేటి నుంచి మంత్రిని భారీ కాన్వాయ్‌తో స్థానిక మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి గృహప్రవేశ కార్యక్రమానికి తీసుకువస్తామని తెలిపారు. ఆతర్వాత వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి హాజరవుతారని తెలిపారు. మంత్రికి స్వాగతం పలకడానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చీపులేటి వద్దకు చేరుకోవాలని కోరారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

చిలమత్తూరు: వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న రాష్ట్ర భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి మండల నాయకులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన సోమఘట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కొడికొండ చెక్‌పోస్టు వద్దకు తరలిరావాలని సూచించారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఓటరు రీ సర్వే వంద శాతం విజయవంతం

- సబ్‌కలెక్టర్ కార్తీక్

పెనుకొండ: నెల రోజుల పాటు జరిగిన జరిగిన ఓటర్ సర్వే వంద శాతం విజయవంతంగా పూర్తయినట్లు సబ్‌కలెక్టర్ కార్తీక్ తెలిపారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాల్‌లో గురువారం ఆయన నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ రీ సర్వే కార్యక్రమానికి సహకరించిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ గణేష్‌కుమార్, షాషావలి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



క్షతగాత్రుడి పరిస్థితి విషమం

సోమందేపల్లి: మండలంలోని పేటకుంట సమీపంలో ఉన్న దూవంగ్ పరిశ్రమలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన మల్లేష్ నాయక్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. బెంగళూరు చికిత్స పొందుతున్న బాధితుడిని ఎస్ఐ విజయ్‌కుమార్ గురువారం పరామర్శించి ప్రమాదానికి సంబంధించి వివరాలు సేకరించారు.

రూ.లక్ష విరాళం



రూ.లక్ష అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు

హిందూపురం అర్బన్: కిరికెర గ్రామంలో నిర్మిస్తున్న శ్రీఅయ్యప్ప స్వామి ఆలయానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. నాయకులు వేణురెడ్డి, కిరికెర మూర్తి, హనుమంతరెడ్డి, రామాంజనరెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నియంత్రణకు చర్యలు



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నియంత్రణపై గట్టి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు గురువారం ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద వివిధ దుకాణాలను తనిఖీ చేశారు. తక్కువ మైక్రాన్ కల్గిన 120 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో లభ్యమైన ప్లాస్టిక్ కవర్లను చైర్‌పర్సన్ పరిశీలించారు. మరోసారి కవర్లు లభ్యమైతే రూ.10వేల జరిమానా విధించాలని చైర్‌పర్సన్ ఆదేశించారు.





